# సర్వం జగన్నాథం

యామినీ సరస్వతి

టకటకమని తలుపు మీద శబ్దం వినగానే "అదిగో! వచ్చేశారు" అంటూ తలుపు తీశాడు రామిరెడ్డి. అతని పక్కనే రామిరెడ్డి భార్య లక్ష్మీదేవి.

లోపలికి వచ్చేశారు సూర్యారావు, అతని భార్య వాగ్దేవి. వాగ్దేవి లక్ష్మీదేవి ముఖాన వున్న బొట్టు మీదే బొట్టు పెట్టి పిలిచింది "రేపు మావారి పుట్టినరోజు! భోజనానికి రావాలి!"

"రామా! మరిచిపొయ్యేవు!" అన్నాడు సూర్యారావు.

"ఆగస్టు 15 మనకిస్వాతంత్ర్యం వచ్చిందన్నమాట మర్చిపోవచ్చేమోకాని 3వ తేదీ నువ్వు పుట్టావన్న మాట మరిచిపోతానా" నవ్వుతూ అన్నాడు రామిరెడ్డి.

"ఆయన నూనె తినరు" అంది లక్ష్మీదేవి.

"యాళ్లూరు నుంచి రెండు వీశల నెయ్యి తెప్పించాం" అంది వాగ్దేవి.

"లడ్డు వేయిస్తున్నా" అన్నాడు సూర్యారావు.

"నేతి లడ్డా?" అడిగేడు రామిరెడ్డి.

"ఆహా! నీకిష్టమని బ్రేక్‌ఫాస్ట్‌కి ఉప్పొంగలి కూడా వేయిస్తున్నా-దానికి జత అలసంద వడ!" అన్నాడు రావు.

"నోరూరేలా చెప్పిందే తృప్తివుండదా!"

"రెడ్డిమాటలకు నవ్వింది లక్ష్మీదేవి. "నేనంటూనే వున్నా! రేపు కూరగాయలు ఏమీ లేవు. బజారు వెళ్తున్నారు కదా కూర పట్టండి అని- రేపు మీ యింటికి భోజనానికి వస్తాం-కూర లెందుకు అంటున్నా డాయన అంతలో మీరొచ్చారు" అందామె.

తృప్తిగా నవ్వాడు రావు.

"వస్తాం" అంటూ కదిలింది వాగ్దేవి.

"వస్తాం అంటూ వెళ్తారేంటమ్మా!" అన్నాడు రెడ్డి.

"వెళ్ళొస్తాం అన్నమాట. స్పీడు పెరిగిందికదా-అంచేత మాటల పొదుపు" అంది వాగ్దేవి.

"రచయిత భార్య అనిపించుకున్నారమ్మా!"

"ఊహూ! నా పేరు వాగ్దేవి-అది మర్చిపోకండి" అంది నవ్వుతూ. ఆమె నవ్వుతో అందరూ జత కలిపారు. అక్కడ్నించి సూర్యారావు వాగ్దేవి పక్కవీథికి వెళ్ళారు. అక్కడ శేషఫణి వున్నాడు. వీళ్ళని చూడగానే-

"సంక్రాంతయినా ఒక్కోసారి జనవరి 15న వస్తుందేమోకానీ మీరు మాత్రం యిలా రెండవతేదీ సాయంకాలం రాక మానరు" అన్నాడు ఫణి.

నవ్వేడు రావు.

"విజయా!" పిలిచాడు ఫణి.

ఫ్లాస్కులోంచి కాఫీ వంచుకుని మూడు కప్పులూ ట్రేలో పెట్టుకుని వచ్చింది విజయలక్ష్మి. కాఫీలు ఇచ్చింది. తాగేరు.

"రేపు అందరూ భోజనాలకి రావాలి"

"ఎందుకమ్మా! బొట్టు పెట్టి పిలిచాక అడిగింది ఆమె.

"అబ్బో! తెలీనట్టు రేపు మీ అన్నగారి పుట్టిన్రోజు"

"భోజనాలకి ఏమోగాని సాయంకాలం వస్తాంలే!"

"భోజనాలకి ఎందుకు రారు? మీరంతా వస్తారని మీకోసం 'జాం జాం' అంటూ గులాబ్ జాం చేయిస్తె వున్నారు-రానంటే ఎల్లా?"

"కోపం వద్దులే! వూరికే అన్నా!"

"నేను వూరకే అన్నాన్లేబ్బా!"

"నాకోసం ఏందమ్మా స్పెషల్?" అడిగాడు ఫణి.

"మీ కోసమా సార్-ఆయన్నే చెప్పనివ్వండి"

"అరటి కాయ బజ్జీలు ప్లస్ ఆవడలు-" అన్నాడు రావు.

"భోజన చక్రవర్తి వస్తున్నాడా?"

"వెళ్ళి పిలుస్తాం. వస్తాడు. పాపం మనతో కలిసి భోం చెయ్యాలని ఆశ. అదేదో అంటారే పేరుకి నవాబు ఇంట్లో గరీబు అని, మనం తమాషాగా భోజన చక్రవర్తి అనడవేగాని, ఆశలావు పీక సన్నం అని పట్టుమని పిడికెడు తిన్లేడు" అన్నాడు రావు.

"ఎవరు? భాస్కరా?" అడిగింది వాగ్దేవి.

"ఆ!"

"శాస్త్రిగారిని పిలవడానికి వెళ్తాంగా అక్కడే పిలుద్దాం"

"వెళ్ళొస్తాం తప్పక రావాలి అందరూ" అంటూ లేచాడు.

"మీ రొద్దన్నా వస్తాం" అన్నాడు ఫణి.

"భలేవారే-ఎందుకొద్దంటాం" అంది వాగ్దేవి.

"మాటవరసకన్నార్లే" అన్నాడు రావు.

రోడ్డెక్కాక అంది. "మాట వరసకయినా కొన్ని కొన్ని అనకూడదంటారు తెలుసా? నా చావు కొచ్చింది

అని-ఎప్పుడు వస్తామో అని-దుంపతెగ అని అంటుంటారు. తథాస్తు దేవతలుంటార్ట" అంది వాగ్దేవి.

"అలా అవకూడదని అందరికీ తెలీదుగా" అన్నాడు రావు. భాస్కర్‌ని, శాస్త్రిని, డాక్టర్‌ని, మరో ఇద్దర్ని భోజనాలకి ఆహ్వానించి రిక్షా ఎక్కి యింటికి వచ్చారు. ఆసరికి గుండూరావు వచ్చారు.

"గుండూరావ్!"

"అయ్యా! గులాబ్‌జాం యిప్పుడే వెయ్యమంటారా?"

"ఆ"

"ఫ్రిజ్‌లో పెట్టేస్తే బావుంటుంది" అంది వాగ్దేవి.

"లడ్డు మాత్రం రేపే వెయ్యాలి. వేడి వేడిగా తాజా తాజాగా వుంటేనే బూందీ లడ్డు రుచిగా వుంటుంది"

"అయ్యా!"

"పాయసం ఏం చేస్తావు?"

"పేరుకి శ్రావణమాసమనేకానీ ఎండలున్నాయి కదా! పెసరపప్పుతో చేయిద్దాం" అంది వాగ్దేవి.

"అయ్యా!"

"జీడిపప్పు, ద్రాక్ష ఎత్తుకి ఎత్తు వెయ్యాలి"

"అంటే చక్కెర్తోనా? పప్పుతోనా?"

"గిద్దెడు పప్పుమకో-గిద్దెడు పంచదారనుకో వాటితో సమంగా అన్నమాట" అన్నాడు రావు.

"అయ్యా- పాలుమాత్రం బావుండాలి"

"వాగలింగం దగ్గరుండి పిండి పోస్తానన్నాడు"

"ఏమిటేమిటి?" ఆశ్చర్యపోయింది వాగ్దేవి.

"పిండి అంటే పిండి పాలు కాదోయ్-పాలు పిండి పోస్తాడు" నవ్వుతూ అన్నాడురావు. పిల్లలూ జతకలిపారు.

"అమ్మా! డాడీ బర్త్‌డేకి నాకేం చేస్తావు?"

"నీకు కోవా యిష్టం కదా! చేయిస్తా"

"మరి నాకూ?"

"కారాలు"

"నాకూ"

"మిరపకాయ బజ్జీలు-ప్లస్ కొన్నిటితో కట్ మిర్చి" ఆఖరివాడు మొదలుకుని అంతా అడిగారు.

"బాబుకి ఏం కావాలి?" అన్నాడు గుండూరావు.

"అన్నీ!" నవ్వుతూ అన్నాడు బాబు.

"తిండి పుష్టి దేశంలో తగ్గిపోతోందయ్యా!" అన్నాడు గుండూరావు.

"రాయలసీమ పంటకు కరువు-నీళ్ళకి కరువులాగే బాగా తినేవాళ్ళు కరువయ్యారు" అన్నాడు సూర్యారావు.

"కొంతయినా మేలు చాలా చోట్ల నీతికీ, నిజాయితీకీ కృతజ్ఞతకు స్నేహానికి ఆత్మీయతకీ కూడా కరువొచ్చింది" అంది వాగ్దేవి.


ఔనన్నట్టు తలూపేడు రావు.


"పప్పులో ఏం వేస్తావ్!"

"మా పెరట్లో తాజా చుక్కకూర వుందయ్యా!" అంది పనిమనిషి.

"భేష్! తెల్లారకముందే పట్రా! ఇదిగో గుండూరావూ! చుక్కకూరలో కాస్త గోంగూర వెయ్యాలయ్యా! పులుపు బాగా కలుస్తుంది — "

"చిత్తం."






"చారుపాడి."

"రేపు ఉదయమే వేయించి మిక్సర్‌లో వేడివేడిగా కొట్టేస్తా!" అంది వాగ్దేవి.

మెచ్చుకోలుగా చూశాడు.

"పచ్చడికి —" అడిగాడు గుండూరావు.

"సాయంకాలానికి తాజా తాజా వంకాయలొస్తాయి. ధనియాలు, పచ్చిమిర్చి వేయించి నూరు."

"చిత్తం. కూరలు."

"బీరకాయ, బెండకాయ, కాబేజి."

"పచ్చడి ఒకటే అయింది" అన్నాడు గుండూరావు.

"ఊరగాయ వుందిలే" అంది వాగ్దేవి.

"అప్పడాలు, వడియాలు, ఊరమిరపకాయలు వుంటాయిగా."

"ఆ " అంది వాగ్దేవి.

"ఇదిగో గుండూరావ్!"

"చిత్తం—"

"లేలేత అరిటాకులు, తమలపాకులు—"

"లక్ష్మీనారాయణగారి తోటకు పంపండి బాబూ- పెద్దబ్బాయి కేసి చూశాడు రావు.

"రేపొద్దున్నే తెస్తా—"

"నేనూ తోడు వెళ్తా—"

"నేనూ ..."

"ష్! పరమానందయ్య శిష్యుల్లా తయారవ్వకండి! తోట చూడాలంటే ఇంకో రోజు వనభోజనానికి వెడదాం. బాబొక్కడే వెళ్ళొస్తాడు. ఒరే వస్తూ తాజా నిమ్మకాయలు పట్టా. చిత్రాన్నం కలిపిద్దాం"

తలూపేడు వాడు. మిగతా పిల్లలు కిమ్మనలేదు.

"పెరుగు."

"అదిగో పాలొచ్చాయి. ఏం? బాగా నీళ్ళు కలిపి తెస్తున్నావా?"

"మీకు నీళ్ళపాలు పోస్తే కళ్ళు పోతాయి బాబూ" అంది బాలమ్మ.

"ఎవరికి మాకా?"

"ఛ!ఛ! మాకు" అంది బాలమ్మ.

"ఎన్ని తెచ్చావ్?"

"పది లీటర్లు."

"పది లీటర్లు చాల్తాయా?"

"చిత్తం. ఆవడకి, వడ్డనకి చాలండీ!"

"ఏమో! ఎందుకైనా మంచిది.

GEET MALA
GM
CASSETTES

GEETMALA CASSETTES
FOR ORIGINAL LIVE RECORDINGS
OUR RECENT RELEASES
* భారతంలో చిన్న కథలు
ప్రయాగ రామకృష్ణ
* జానపద భక్తిగీతాలు
* జానపద ఆణిముత్యాలు
* దుర్గాంబిక గీతమాల
రచన: డా॥ దాశరథి, సంగీతం: జి.వి. ప్రభాకర్
SANDILYA

రీటర్లు పొద్దున్నే పట్టా. తోడేస్తే భోజనాల వేళకి పేరుకుంటాయి" అన్నాడు రావు.

"చిక్కని పాలు తీసుకురా" అంది వాగ్దేవి.

"చి-క్క-ని పాలు ఎక్కడ చిక్కుతాయ్ వాగ్దేవి" అన్నాడు రావు చమత్కారంగా. అంతా నవ్వేశారు. బాలమ్మ వెళ్ళిపోయింది.

"ఆ అన్నీ అయ్యాయా?" అన్నాడు రావు.

"చిత్తం."

"మరి నువ్వు పనిమీద వెళ్ళు" అన్నాడు రావు.

గుండూరావు లోపలికి వెళ్ళేడు.

** ** **

"గుడ్‌మార్నింగ్! మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" మార్నింగ్ కిస్ అందిస్తూ గ్రీటింగ్స్ చెప్పింది వాగ్దేవి. అప్పుడే పుట్టిన పిల్లాడిలా సుతారంగా కళ్ళు తెరిచి చూస్తూ "థాంక్యూ!" అని బదులు తీర్చాడు రావు.

ఆపై శుభ్రంగా తలంటి తలకు పోసి, తల తుడిచి, ముఖాన బొట్టు పెట్టి అరఅరగా తల దువ్వింది వాగ్దేవి. ఆ సమయానికి రేడియోలో 'వందేమాతరం' వస్తోంది.

పిల్లలు బిలబిలా లేచి డాడీకి గ్రీటింగ్స్ చెప్పారు.

అందరికీ పాతికేసి రూపాయిలిచ్చాడు రావు.

వాళ్ళు ముఖాలు కడుక్కోడానికి వెళ్ళగానే 'నాకో!' అన్నట్టు చూసింది వాగ్దేవి.

బీరువా తీసి బంగారు గాజులు తొడిగాడు రావు.

ఆశ్చర్యపోయింది వాగ్దేవి.

"ఎప్పుడు తెచ్చారు?"

"నిన్న మధ్యాహ్నం!"

"మీరు నాకు తెలియకుండా కూడా దాస్తున్నారన్న మాట."

"నిన్ను సర్‌ప్రయిజ్ చేయాలని."

"అది—"

"నీ అది నాకు తెలిసిందటోయ్. భవానిశిలో చెప్పాను. అర్జంటని. నాలుగు రోజుల్లో తయారయ్యాయి. ఎలా వున్నాయ్?"

"నంబర్ వన్" తృప్తిగా అందామె.

"కాదు నంబర్ లెవెన్ మోడల్. నంబరు టు సైజ్."

"నే వంటున్నది క్వాలిటీ" అంది గాజులు గుండ్రంగా తిప్పుతూ. ఆమె వాటికేసే చూస్తోంది.

"ఎంత నేర్చిన, ఎంత చదివిన ఎంత వారలయినా కాంతలు కనకదాసులే" అన్నాడు రావు.

పెదాలు సున్నాలా చుట్టింది దేవి - "నేనడిగానా?" అన్నట్టు.

"అడిగితే తెచ్చివ్వడంలో గొప్పేం వుందోయ్" చప్పున పాదాభివందనం చేసింది.

"అర్రెరే! ఇదేమిటి?"

"అది మీ మంచితనానికి" అంది వాగ్దేవి.

** ** **

ఉదయం బ్రేక్‌ఫాస్టుకే వచ్చారందరూ. ఒక్కొక్కరే వస్తుంటే ముందు అందరికీ బ్రూ కాఫీ కలిపి ఇచ్చాడు.

ఎనిమిదింటి కంతా అంతా వచ్చేశారు. వరసగా హాల్లో అందరూ బంతులు తీరారు. పచ్చటి అరటి ఆకులు సైజుగా కట్ చేసి వేడి వేడి ఉప్పొంగలి, వేడి వేడి గారెలు వడ్డించాడు గుండూరావు అసిస్టెంటు.

"తెల్లగా తెల్లారకముందే" అన్నాడు శాస్త్రి.

"ఎనిమిదైంది సార్" అన్నాడు భాస్కర్‌రెడ్డి.

"నీకు తెల్లారి లేస్తూన్నే సద్దన్నం తినడం అలవాటుతీ."

"సద్దన్నం రుచి మీ బ్రాహ్మలకేం తెలుసు?"

"చాల్లేవో- మేమూ ఉపనయనం అయ్యేదాకా వద్దన్నాలు మెక్కినోళ్ళమే" అన్నాడు శాస్త్రి. ఆ మాటలకి అంతా నవ్వారు.

"ఉప్పొంగలి ఫస్టు" అన్నాడు డాక్టరు.

"కానీ సర్! చక్కెర పొంగలిలా వుండదు" అన్నాడు రామిరెడ్డి.

"చక్కెర పొంగలి ఇలా ఎలా వుంటుంది?" అన్నాడు శాస్త్రి.

"ఇది అరగాలిగా!"

"ఆ అంతదాకా వుంటుందా? పన్నెండయ్యేసరికి ఆకలి రెపరెప మంటుంది" అన్నాడు భాస్కర్.

"నువ్వూ, మాచకమ్మా ఒకటే!" అన్నాడు రామిరెడ్డి.

"ఏం?" ఉక్రోషపడ్డాడు భాస్కర్.

"ఆ ఏం లేదు. ఇద్దరూ మాటలవరకే అని" అన్నాడు శాస్త్రి.

"చూద్దాం. ఈ రోజు నేనూ ఓ పట్టుపడ్తా."

"భాస్కర్ - పట్టుదలకి పది ముద్దలు తిన్నావనుకో రాత్రికి అరగదు. రేపు మందం. మళ్ళీ ఎల్లుండే ప్రాశన. ఎందుకొచ్చిన గొడవ చెప్పు" అన్నాడు డాక్టర్.

"ఎవరి ముందైనా డబ్బా కొట్టొచ్చు. కానీ, డాక్టర్ల ముందు భోజన పరాక్రమం చెప్పకో కూడదు. అందునా నీలాటి గ్యాస్ట్రిక్ పేషెంట్" అన్నాడు రావు.

"నాకిప్పుడే జబ్బూ లేదు" అన్నాడు భాస్కర్.



ఆనందజ్యోతులు. -చిత్రం: ఎ.ఉష, బరిసాల

"అంతా పకపకమన్నారు.

"చక్కెర పొంగలికి కాంబినేషన్ దద్దోజనం."

"అది వైష్ణవ టెంపుల్స్‌లో."

"తినడానికి మతాలెందుకు?"

"శివాలయాల్లో పెయ్యరుగా."

"పాపం శివుడు బీదవాడు. అభిషేకం అంటూ బిందెడు నీళ్ళు గుమ్మరిస్తే చాలు. ఆ ఆ మాటల్లో వుంటే అలా తోసేస్తావే" అన్నాడు భాస్కర్.

"తినండి సర్!" అన్నాడు కుర్రాడు.

"ఆ ఆ తినాల్సిందే. ఈ పొంగల్తోనే కడుపు నింపుకుంటే."

"ఏం?"

"ఔనౌను" అన్నాడు డాక్టర్.

టిఫిన్లయ్యాక నెస్‌కఫే తాగేరందరూ.

తర్వాత అందరూ కబుర్లలో పడ్డారు. రావు, వాగ్దేవి, విజయలక్ష్మి, శైలజ మాటి మాటికి యిటొస్తూ అటు వెళ్తూ వంటని పర్యవేక్షిస్తూ గుండూరావుని హెచ్చరిస్తూ తొందరిస్తున్నారు.

పన్నెండింటికి "శుభం" అన్నాడు గుండూరావు.

"ఎవరు వడ్డిస్తారు?" అడిగాడు రావు.

"అయ్యా! నేనూ మా కుర్రాడు వడ్డిస్తాం. మీరంతా కూర్చోండి. అందరూ ఫ్రెండ్సే కదా! కబుర్లతో నంజుకోండి! మీదయ్యాక మేం భోంచేస్తాం" అన్నాడు గుండూరావు.

"నేను దగ్గరుంటాలే" అంది వాగ్దేవి.

"అమ్మమ్మ! మీరూ అయ్యగారూ పక్కపక్కనే కూర్చోవాలి!"

"బువ్వబంతులా?" అంది విజయలక్ష్మి.

"అనుకోండమ్మా! తప్పేం వుంది?"

"ఆయన ఈరోజే పుట్టాడయ్యా!" అంది వాగ్దేవి.

"అయితేనేం తల్లీ- అంతై ఇంతై అన్నట్టు ఉదయం నుంచి పెరిగి పెద్దయ్యారు" అన్నాడు గుండూరావు విస్తళ్ళు వేస్తూ.

"లెండి! లెండి! ఆకులు పరిచారు!" అన్నాడు భాస్కర్.

"అప్పుడే చారు అంటావేంటోయ్ రెడ్డీ!" చమత్కరించాడు శాస్త్రి.

"నయం- పెరుగు అంటూ క్లయిమాక్స్‌కి వెళ్ళ లేదు" అన్నాడు ఫణి.

"అతనంతే దేన్లోనైనా స్టార్టు- కట్- క్లైం ఇవ్వడు" అన్నాడు రామిరెడ్డి. అంతా గొల్లున నవ్వారు.

భోజనాలకి కూర్చున్నారు.

వడ్డన అయింది. అభికరించాడు రావు. అందరికీ హస్తోదకం వేశారు వాగ్దేవి.

"మొత్తానికి మమ్మల్నీ బ్రాహ్మల్ని చేశావు" అన్నాడు భాస్కర్.

"అపర వీరేశలింగం! సర్వం జగన్నాథం అంటూ ఏడాదికోసారో- రెండుసార్లో ఏక పంక్తి భోజనాలు పెడతాడు" అన్నాడు రామిరెడ్డి.

"వీరేశలింగం కాదు- బ్రహ్మనాయుడు" శాస్త్రి సవరణ.

"భోజనాల ముందు మాటలు పనికిరావు."

"ఈ జనాలకు మాటలే భోజనాలు"

"కూర్చోండి!" అంటూ ఔపోసన పట్టాడు రావు.

"ఊరగాయ ఘాటు తగ్గలేదే!"

"వాసెన బాగా కడ్తే ఘాటెక్కడ పోతుంది?"

"వంకాయ పచ్చడి భలే వుంది."

"మరికాస్త కలుపుకోండి!" అంటూ నెయ్యి వేశాడు గుండూరావు.

"అలా గుమ్మరిస్తావేంటయ్యా! అరక్క చావ మనా?"

"బాబ్బాబూ! నెయ్యి అరగాలనే వేస్తాం" అన్నాడు రావు.

"చుక్కకూర భేషుగ్గా వుంది."

"దాన్లోకి మిర్చీ బజ్జీ నంజుకో"

"ఎందుకూ వడియాలు వున్నాయిగా."

"వడి ఆలు వుందా?"

"హు ఎవరాలయినా వడిగానే వుంటుందిలే! ఈ రోజుల్లో స్లో ఎవరు?" అన్నాడు భాస్కర్.

"అప్పుడే కూరా? పప్పు మరోసారి" అన్నాడు గుండూరావు.

"ఇదిగో గుండూరావ్! పచ్చడి, పప్పుతోనే కడుపు నింపితే ఎలాగయ్యా? లడ్లూ- జాంలూ-"

"బాబూ- మన కడుపులో 'అర'లు చాలా వుంటాయి గాద్రెజ్ బీరువాలో లాగా- పప్పుడికి, పప్పుకి, పాయసానికి, పొడి కొంచం, స్వీటు, హాటు, చారు, ఆఖర్న పెద్ద అరపెరుక్కి- మీరేం కంగారు పడకండి. ఈ మెంతి మజ్జిగ నంజుకోండి."

"మీరు ఆవడ తినరా?"

"ఎందుకూ? శుభ్రంగా మెక్కుతాడు. పెరుగు కాస్తెక్కువెయ్."

"లడ్డు "

"నాలుగు జతలా! బాబో-"

"బాబూ- తిండి కలవాడేను మనిషోయ్ అన్నాడు మహానుభావుడు. తుష్టిగా తినండి. పుష్టిగా వుండండి" అన్నాడు మరో రెండు వడ్డిస్తూ.

"అదృష్టం కొద్దీ ఆగస్టు మూడు ఏడాదికొసారి వస్తుంది కానీ... లేకపోతే—" అన్నాడు భాస్కర్.

"భాస్కర్ నువ్వు ప్రతి నెలా మూడొచ్చు"

"బాబ్బాబూ- నన్ను నాలుగు కాలాల పాటు-"

"పెరుగు ముక్కలుగా కోశావేంటయ్యా?"

"గట్టిపడింది బాబూ! మీగడ అలా తేరి కోవాలా బిగిసింది"

"పాలు పోసే మహానుభావుడెవరో!"

"ఎత్తం కొద్దీ విభవం."

"అబ్బో! మేమూ దబ్బిచ్చే కొంటున్నాం."

"ఆ... ఆ... అంతా లీటరు నాలుగంటే మనం రెండుకీ-"

"అర్థానికా?"

"అర్థం తక్కువయ్యే."

"భోజనకాలే గోవిందనామ స్మరణా-"

"భాస్కర్ నీకు బ్రాహ్మణ ఆచారం వంట పట్టిందే!"

"ఆరునెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారట"

"మరాయన మంతో కలవడే-"

"గొంగళిపురుగు సీతాకోక చిలకవుతుందే కాని- రివర్స్‌లో-"

"నేనేం పురుగును కాదు."

"చేతులు శుభ్రంగా తుడుచుకోండి! భోజనాలకి ముక్తాయింపు వస్తోంది."

"తాంబూలమా? పళ్ళు లేవా?"

"ఓర్నీ! అరటి పళ్ళున్నాయిలే పళ్ళెంలోనే. తిను ఎన్ని తింటావో."

"ఎన్నా! ఓ ముక్కయితే ఎక్కువ."

తాంబూలాలతో అందరి నోళ్ళూ ఎర్రబడ్డాయి. తృప్తితో రావు, వాగ్దేవి...

పెరట్లో గాడిపొయ్యి నానుకుని అరిటాకులో ఓ పచ్చడి, కాసిన్ని మెతుకులు వడ్డించుకుని గుండూరావు

"అదేంటయ్యా? నీ భోజనం-"

"అమ్మా! ఈ నెయ్యి వండి వడ్డించడానికే! కలుపుకుని తిండానికి కాదు. ఎవరికెంత ప్రాప్తమో అంతే! వాళ్ళంతా కడుపారా భోజనం చేశారు. నా కడుపు నిండిపోయింది."

"భోజనమయ్యాక తాంబూలంలో 'వంద' పెట్టింది వాగ్దేవి.

"వద్దమ్మా! ఓ పూట వంటకు వంద తీసుకుంటే పుట్టే కూడూ పుట్టదు. అరవంద చాలు" అని ఒక నోటు తీసుకున్నాడు గుండూరావు.

బయట వసారాలో అంతా పరుపుల మీద ఒరిగిపోయి గుండూరావు వంటను, సూర్యారావు ఆతిథ్యాన్ని నోరారా పొగుడుతున్నారు.

"ఎన్నయినా చెప్పు- ఏదిచ్చినా చాలు అనం, అనలేం- భోజనం ముందు మాత్రమే అంటాం. తృప్తి అనేది అక్కడే వుంది" అంటున్నాడు భాస్కర్.

"రావులాంటి వాళ్ళు నలుగురుంటే ఊళ్ళో కుల మతాలు కలిసిపోతాయ్" అంటున్నాడు రామిరెడ్డి.

"పుట్టుకతో అంతా సమానమే. విద్యా, ఉద్యోగం, హోదా- ఇవి మనుషుల్ని వేరు చేశాయి" అన్నాడు డాక్టర్.

"అదెంతమందికి తెలుసు?"

శాస్త్రి జడ్జిమెంటు. ●

## స్నేహం కోసం



స్నేహమా,
నీ కాలికి ముళ్ళు విరిగితే
నేను పంటితో తీశాను.
ముళ్ళు తీసిన తర్వాత
అదే కాలితో నా మొహం తంతే
ముళ్ళమీద కోపంతో నా మొహం
మీద తన్నావు కాబోలునని
సరిపెట్టుకున్నాను
అందుకే,
మరోసారి ముళ్ళు విరక్కుండా వుండాలని
నీవు నడిచే దారిలో నా అరచేతుల్ని
తివాచీలా పరిస్తే,
అది చూసిన నీవు, నీ కాళ్ళకు
కత్తులు కట్టుకుని నడిచావు.
అయినా నాకు సంతోషమే...
పోయింది నా ప్రాణాలు కాదు-
చేతులు మాత్రమే.
ముక్కలయింది నా హృదయం కాదు-
వేళ్ళు మాత్రమే.

—భాస్కర్